క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ఉయ్యాలవాడ : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ సూచించారు. గురువారం మండలంలోని ఎస్.కొత్తపల్లె, అల్లూరు, తుడుమలదిన్నె గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పత్తి, మిరప, మినుము, పెసర, పొగాకు, మొక్కజొన్న, వరి, కంది తదితర పంటలు సాగు చేశారన్నారు. ఇప్పటి వరకు 3,550 హెక్టార్లలో పంటల ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశామని చెప్పారు. ఈ నెల 25వ తేదీలోగా అన్నదాతలు పంటలను వ్యవసాయ సహాయకుల దగ్గర నమోదు చేయించుకోవాలని కోరారు.

విజయవంతం చేద్దాం

ఉయ్యాలవాడ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండలంలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేద్దామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు కోరారు. గురువారం మండలంలోని తుడుమలదిన్నె గ్రామ సచివాలయం, మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఆయా శాఖల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో వైద్యాధికారులు రాబర్ట్‌కెనడీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల విరాళం

శిరివెళ్ల: రాజనగరం జెడ్పీ ఉన్నత పాఠశాల 1988–89 బ్యాచ్ విద్యార్థులు క్రీడా పరికరాలను విరాళంగా అందచేశారు. గురువారం పాఠశాలలో మండల స్థాయి క్రీడల పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా రూ. 55 వేల విలువజేసే క్రీడా పరికరాలు, క్రీడా దుస్తులను హెచ్‌ఎం వరాహమయ్యకు అందజేశారు. వారిని టీచర్లు, క్రీడాకరులు విద్యార్థులను అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

నంద్యాల(సిటీ): సత్వర సేవలు అందించేందుకు సచివాలయ ఉద్యోగులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు సూచించారు. గురువారం సాయంత్రం పట్టణంలోని 13వ వార్డు సచివాలయాలన్ని డీఈఈ మధు కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మూవ్‌మెంట్ రిజిస్టర్‌లతో పాటు పలు రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

నేడు మండల స్థాయి పోటీలు

గోస్పాడు: మండల స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ అబ్దుల్‌కరీం తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలుంటాయని చెప్పారు. బాలికలకు గోస్పాడులోని కస్తూర్బా పాఠశాల, బాలురకు మోడల్ స్కూల్‌లో పోటీలు ఉంటాయని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ పౌరుల ప్రాథమిక విధి

ఆళ్లగడ్డ: పరిసరాలను కాపాడుకోవడం, సహజ పర్యావరణాన్ని పరిరక్షించడం పౌరుల ప్రాథమిక విధి అని ప్యానెల్ అడ్వకేట్ సరిత అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఈ సురేంద్రనాథ్‌రెడ్డి, మెప్మా సీ ఎం శోభ, శానిటరీ సెక్రటరీ బాలస్వామి, హెల్త్ సెక్రటరీలు, ఆర్పీలు ఉన్నారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

నంద్యాల(అర్బన్): పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు మాదిగ డిమాండ్ చేశారు. వర్గీకరణ చేపట్టాలంటూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్, ఎంఎస్‌ఎఫ్‌ల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు గురువారం ఏడో రోజుకు చేరాయి.

రుద్రవరం: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట గురువారం ఎమ్మార్పీస్ నాయకుడు మణికంఠ, ఎమ్మెస్‌పీ నాయకుడు జల్లవరం చిన్న సుబ్బరాయుడు, మైనార్టీ నాయకులు అల్లా బకాష్, బీసీ నాయకులు పుల్లన్న, మల్లె పువ్వు జయన్న తదితరులతో కలిసి రిలే దీక్ష చేపట్టారు.

ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కోటవీధిలో వెలసిన శ్రీ రమాసమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో గురువారం శ్రావణ మాస అమవాస్యను పురస్కరించుకొని మహాలక్ష్మిదేవికి సామూహిక శతదీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేపట్టి విశేషంగా అలంకరించారు. అనంతరం సామూహిక దీపోత్సవ అమృత హారతుల కార్యక్రమం జరిపించారు. అలాగే.. కల్పనా సెంటర్‌లోని కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు, సహస్ర జలాభిషేకం నిర్వహించిన అనంతరం విష్ణుసహస్ర నామ పారాయణం జరిపించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆశ్రమ గౌరవాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, చక్రపాణి, ఈశ్వరరెడ్డి, సుబ్బాచారి పాల్గొన్నారు. నూనెపల్లె అమ్మవారిశాలలో శ్రావణ మాసం గురువారం, అమావాస్య సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త జ్ఞానప్రసాద్ గురూజీ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి కుబేర సామూహిక పూజా కార్యక్రమం నిర్వహించారు.

సేదతీరుస్తూ..సేద్యం చేస్తూ



సేద్యం చేసి అలసిన ఎద్దులకు కాడి తొలగించి సేదతీరుస్తూ.. తానూ విశ్రాంతి తీసుకుంటున్న రైతు



అలసిన ఎద్దులను నిమురుతున్న రైతన్న



తిరిగి మళ్లీ పొలంలో ఉత్సాహంగా పనిచేస్తూ

దొర్నిపాడు: రైతన్నకు నిజమైన నేస్తాలు ఎద్దులు.. అవి కూడా తన యజమాని మనసెరిగి మసలుకోవడం చూస్తే వారి ఆ అనుబంధం ఎంత గొప్పగా ఉంటుంది. ఒకసారి కాడి కట్టి అదిలిస్తే సాలు తప్పకుండా, సరైన దిశలో..మళ్లీ పురమాయించాల్సిన పనిలేకుండా పని చేయడం వాటికి అలవాటు. తమకు చేదోడు వాదోడుగా ఉంటున్న వృషభాలను అన్నదాతలు కుటుంబ సభ్యుల్లా చూస్తారు. ఉదయం నుంచి విరామం లేకుండా నాలుగు ఎకరాల్లో రసాయన మందులు విత్తాయి. ఇంకా మూడు ఎకరాలు మిగిలి ఉంది. పని పూర్తయితే ఇంటికెళ్లిపోవచ్చనుకున్నాడు రైతన్న. ఇంతలో తన నేస్తాలు ఆలసిపోయాయి. దీంతో కాడిని ముందుకు కదిలించేందుకు మారాం చేస్తున్నాయి. పొలంలో బుడక ఉండటంతో సేదను కోరుకున్నాయి. ఇంతలో రైతు కాడి విప్పి వాటికి కాస్త విశ్రాంతి ఇచ్చి.. తానూ సేదతీరాడు. ఓ అరగంట తర్వాత రెండు ఎద్దుల తలలను తన భుజాలపై ఉంచుకొని మెల్లగా నిమురుతూ.. సేద్యానికి సిద్ధం కావాలన్నట్లు తన మనస్సుతో వాటిని నచ్చజెప్పినట్లుగా దువ్వాడు. దీంతో తన నేస్తం మనస్సును అర్థం చేస్తున్న వృషభ రాజాలు..మళ్లీ వెంటనే రసాయన ఎరువు విత్తేందుకు వెళ్లాయి. పని పూర్తవగానే ఇంటి బాట పట్టాయి. వ్యవసాయంలో భాగంగా ఆధునిక యంత్రాలు, వ్యవసాయ పనిముట్లు అందుబాటులోకి వచ్చినా.. రైతులు మాత్రం కొన్ని పనులకు మాత్రం ఎద్దను ఆశ్రయించక తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలు పత్తి, మిరప పంటలకు ఊపిరి పోసింది. ఇప్పుడిప్పుడే పొలం తడారుతుంటే రైతులు పంటలకు రసాయన ఎరువులను విత్తే పనిలో నిమగ్నంమయ్యారు. ఇందుకు అన్నదాతులు తన నేస్తాలైన జోడెడ్లతో పనులు చేస్తున్నారు. మండలంలోని క్రిష్టిపాడు గ్రామం పొలాల్లో పనులు రైతు మహబూబ్ హుసేన్ తన ఎడ్లతో ఎంతో చాకచక్యంగా పనులు చేయించుకున్న తీరును సాక్షి తన కెమెరాలో బంధించింది.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

గోస్పాడు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను గ్రామాల్లో సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైద్యాధికారి గోపాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 15వ తేఈ నుంచి గ్రామాల్లో ఆశా వర్కర్లు, వలంటీర్లు, గృహ సారథులు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించేందుకు ఎంపీడీఓ, తహసీల్దార్ రెండు టీంలుగా పర్యవేక్షిస్తారు. ఈనెల 30న ఒంటివెలగల, వచ్చేనెల 3న ఎం.కృష్ణాపురం, 4న పసురపాడు, 5న జూలేపల్లె, 6న యాళ్లూరు–1, 7న దీబగుంట్ల, 10న నెహ్రూనగర్, 11న సాంబవరం, 12న కానాలపల్లె, ఎస్.నాగులవరం, 17న యాళ్లూరు–2 గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారని చెప్పారు.

8,596 ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తి

నంద్యాల(అర్బన్): మండలంలో ఖరీఫ్ కింద సాగు చేసిన పంటల్లో 8,596 ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు పూర్తి చేశామని ఏఓ ప్రసాదరావు గురువారం తెలిపారు. మండలంలోని భీమవరం, ఊడుమాల్పురం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేసి పంటల సాగు, ఎరువుల లభ్యత గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో సాగు చేసిన పంటలను ఏఈఓ మణిమోహన్‌రెడ్డి వీఏఏలతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరి, మొక్క జొన్న, మిరప, మినుము, కంది తదితర పంటలను సాగు చేశారని, రైతులు ఈ–క్రాప్ నమోదుతో పాటు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయాలని సూచించారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

నంద్యాల(అర్బన్): పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారులకు పౌష్టికాహార కిట్లను అందించడం అభినందనీయమని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ నిర్మల తెలిపారు. స్థానిక మధుమణి కాన్ఫరెన్స్ హాల్‌లో వరల్డ్ ఇన్ ఇండియా ఆధ్వర్యంలో మండల గ్రామాల్లోని 75 మంది పౌష్టికాహార లోపంతో ఉన్న చిన్నారులకు కిట్లు పంపిణీ చేశారు. సీడీపీఓ చంద్రకళ, ఏసీడీపీఓ పద్మజ. సంస్థ పీడీ తిరుపతి రావు, మదర్ సొసైటీ ప్రెసిడెంట్ రామారావు, బర్న్స్ వెంకటేశ్వరరావు, ఎస్‌బీసీసీ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, రత్న కుమారి పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్రామయ్య

చాగలమర్రి: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య సూచించారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో మండలంలో వినాయక ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు చేసుకునేవారు ఐదుగురు కలిసి వారి ఆధార్‌కార్డుల నకలు జత చేసి దరఖాస్తులను పూర్తి చేసి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలన్నారు. రూరల్ సీఐ హనుమంత నాయక్, ఎస్‌ఐ రమణయ్య పాల్గొన్నారు.

ఏ ఎండకు ఆ గొడుగు పవన్ నైజం



వృద్ధురాలికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



కొత్త పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న దృశ్యం

చాగలమర్రి: వచ్చే ఎన్నికల్లో టీడీపీతో కలిసి పోటీ చేస్తానని ప్రకటించిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్వభావం ఏ ఎండకు ఆ గొడుగు పట్టేలా ఉందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. ఆయన గురువారం ఎంపీపీ వీరభద్రుడుతో కలిసి తోడేండ్లపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. అలాగే గ్రామానికి కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తప్పు చేసిన వ్యక్తులను పవన్ వెనుకేసుకురావడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు తప్పు చేయలేదని పవన్ భావిస్తే నిజాయితీని నిరూపించుకోవాలని ఆయనకు సలహా ఇవ్వాల్సిందన్నారు. 2019కి ముందు టీడీపీని విమర్శించారని, అదే సమయంలో ఎన్నికల్లో ఖర్చు పెట్టటం కోసం నారా లోకేష్ అక్రమంగా డబ్బులు దోచుకుంటున్నాడని చెప్పడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జగనన్నకు ప్రజల్లో ఆదరణ పెరగడంతోనే వీరంతా ఏకమవుతున్నారన్నారు. ఎంత మంది కలిసినా ప్రజాభిమానం ముందు నిలవవని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ జి.కుమార్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేష రమేష్, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, రఫీ, సర్పంచ్‌లు గోవిందయ్య, ప్రతాప్‌రెడ్డి, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, ఎంపీటీసీలు ఫయాజ్, నరసింహులు, వెంకటరాముడు పాల్గొన్నారు.

దీక్ష శిబిరం తొలగింపు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్ ముందున్న రహదారిపై గురువారం టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి ఆధ్వర్యంలో దీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. అయితే జిల్లాలో 30 యాక్ట్ అమలులో ఉన్నందున ప్రభుత్వ స్థలాల్లో దీక్షలు, నిరసనలు వ్యక్తం చేయటానికి పోలీసులు అనుమతించలేదు. ఈ క్రమంలో టూటౌన్ ఎస్ఐ నాగార్జునరెడ్డి తన సిబ్బందితో శిబిరం వద్దకు చేరుకుని టీడీపీ నాయకులను పంపించి ఖాళీ చేయించారు.

ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల(సిటీ): ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు విరజిమ్ముతున్నాయని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక 16వ వార్డు ఎస్‌బీఐ కాలనీలో కౌన్సిలర్ విజయభాస్కర్‌తో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కాలనీవాసులు, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలు తెలిపిన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సిద్ధం శివరాం, మాజీ కౌన్సిలర్ చింత శ్రీనివాస్, వాసగిరి రమేష్, వాసగిరి సుధాకర్, టైలర్ శివ, పరమేశ్వర రాజశేఖర్, శంకర్ నాయక్, ఆర్ వి సుబ్బారెడ్డి, సుధాకర్, బోయ సుబ్బరాయుడు, రామ చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గిరి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): పట్టణంలోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఫ్యామిలీ డాక్టర్ నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డిలతో కలిసి వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, సచివాలయ హెల్త్ సెక్రటరీలు, ఏఎన్‌ఎంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాబున్నిసా మాట్లాడుతూ పట్టణంలోని 8 అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలోని అన్ని వార్డుల్లో ఈ నెల 30వ తేదీ నుంచి వైద్యులు పర్యటించి ప్రజలకు అవసరమైన వైద్యాన్ని అందిస్తారన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ , మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే వైద్యులకు, హెల్త్ సెక్రటరీలకు సూచనలు అందాయన్నారు. వెంటనే ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రతి ఇంటిని సందర్శించాలని సూచించారు. సర్వే నిర్వహించి వివరాలను యాప్‌లో నమోదు చేసి టోకెన్లు జారీ చేయడంతో పాటు 7రకాల ఉచిత పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సంబంధించిన ప్రత్యేక రిపోర్టును వైద్యులకు అందించాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్ పాల్గొన్నారు.

స్పందన వినతుల పరిష్కారం

గోస్పాడు: స్పందనలో వచ్చిన వినతుల పరిష్కారంలో భాగంగా తహసీల్దార్ విజయశేఖర్, కేసీ కెనాల్ డీఈ సుబ్రహ్మణ్యంరెడ్డి గురువారం పరిశీలించారు. ఈనెల 8వ తేదీన మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం నిర్వహించారు. అందులో గోస్పాడు ఎస్సీ కాలనీలో వరద నీరు ముంచెత్తుతుందని, కాలనీ వాసులు వినతి పత్రాన్ని అందజేశారు. అధికారులు ముంపు ప్రాంతాలను పరిశీలించి ఇవి కేసీ పరిధిలోకి రావని, పలు చోట్ల ఆక్రమణలకు గురైన విషయాన్ని గుర్తించి గ్రామ పంచాయతీకి సంబంధించిన విషయంగా ధ్రువీకరించారు. అలాగే పసురపాడు మజరా గ్రామమైన శ్రీరాంనగర్‌లో పొలాలకు వెళ్లే రహదారికి కేసీ కెనాల్‌కు చెందిన కల్వర్టును ఏర్పాటు చేయాలని, మరో ప్రాంతంలో పూడిపోయిన కాల్వను పునరుద్ధరించాలని గ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేయడంతో అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కేసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి అంచనాలు తయారు చేస్తామని చెప్పారు. కాల్వలో పూడిక తీతపై..ఈ విషయం కోర్టు పరిధిలో ఉందని అధికారులు తెలిపారు.

పార్టీలకతీతంగా పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో సర్పంచ్, ఎంపీటీసీలు



లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నామని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అన్నారు. రూరల్ మండలం జి.జమ్ములదిన్నె గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.

రుద్రవరం: మండలంలో కొత్తగా పింఛన్ల పంపిణీ సర్పంచులు,సచివాలయ కన్వీనర్లు,వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో కొనసాగుతోంది. గురువారం మండలంలోని ఆర్.నాగులవరంలో సర్పంచు గంధం సావిత్రమ్మ, పేరూరులో సర్పంచు కోనేటి దేవదానం, మండల మాజీ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, టీ.లింగందిన్నెలో మోహన్‌రెడ్డి, హరి నారాయణ, చుక్క శీను తదితరులు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు.

కొత్త పింఛన్ల పంపిణీ

చాగలమర్రి: మండలంలోని గొడిగనూరు గ్రా మంలో కొత్తగా మంజూరైన 18 వైఎస్సార్ జగ నన్న సంక్షేమ పెన్షన్లను గురువారం గ్రామ సర్పంచ్ సంజీవ రాయుడు, ఎంపీటీసీ సభ్యు డు పత్తి నారాయణ, ఉప సర్పంచ్ పసల కృష్ణవేణి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

నంద్యాల(అర్బన్): పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతుగా ఉందామని చాబోలు గ్రామ సర్పంచ్ మౌనిక, ఎంపీటీసీ దావీదు కోరారు. గ్రామంలోని 43 మందికి ఇటీవల మంజూరైన కొత్త పింఛన్లను గురువారం సచివాలయంలో పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, కో ఆప్షన్ మెంబర్ పాల బాషా, ఉపసర్పంచ్ కమాల్ బాషా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సుస్థిర ఆదాయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల(సెంట్రల్): గిరిజనుల సుస్థిరాభివృద్ధికి రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ సంస్థ సౌజన్యంతో నిర్వహించే కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని జిల్లా సంయుక్త పాలనాధికారి రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రకృతి వ్యవసాయంతో గిరిజనుల సుస్థిరాభివృద్ధి సాధనకు సంబంధించి జిల్లాస్థాయి భాగస్వాముల సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ గిరి పుత్రులు ప్రకృతి వ్యవసాయాన్ని ఉపాధిగా మలచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సంయుక్త పాలనాధికారి గిరిజనులు ఏర్పాటు చేసిన పలు ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించారు. ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, డీఏఓ మోహనరావు, అటవీ, మత్స్య అధికారులు, డీడీఎం, నాబార్డ్, లీడ్‌బ్యాంకు మేనేజర్, డీటీడబ్ల్యూఓ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ, ఇరిగేషన్ ఎస్‌ఈ, రెయిన్ ఫారెస్ట్, విలేజ్ రెన్యువల్ ఆర్గనైజేషన్, కోవెల్ ఫౌండేషన్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమాస్తుల కేసులో ఏసీబీ విచారణ



చాగలమర్రిలో భూములను పరిశీలిస్తున్న అధికారులు

చాగలమర్రి: వైఎస్సార్ కడప జిల్లాలో సేల్స్ ట్యాక్స్ అధికారిగా పనిచేస్తున్న లూర్ధయ్యానాయుడుపై 2016లో అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారని కడపలో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఏసీబీ సీఐ మహమ్మద్ అలీ, ఎస్ఐ నౌషాద్ గురువారం మండలంలోని చాగలమర్రి, గొడిగనూరు గ్రామాల్లో లూర్ధయ్యానాయుడు, అతని బంధువుల పేరిట ఉన్న సుమారు 26 ఎకరాల భూములు, వాటిలో సాగు చేసే పంటలను తహసీల్దారు సుభద్రమ్మ, వీఆర్ఓలు ఇమాంబాషా, శ్రీనివాసులరెడ్డితో కలిసి పరిశీలించారు. అలాగే చాగలమర్రిలో నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూడా పరిశీలించినట్లు తెలిసింది.

వినియోగదారులను మోసగించొద్దు

రుద్రవరం: తూనికలు,కొలతల్లో అక్రమాలకు పాల్పడి వినియోగదారులను మోసగించొద్దని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిత సూచించారు. మండల కేంద్రంలో గురువారం ఆమె తూనికలు,కొలతలను తనిఖీ చేసి ముద్రలు వేశారు. అలాగే మండలంలోని 34 చౌక దుకాణాలకు సంబంధించిన తూనికలను పరిశీలించి వాటికి ముద్రలు వేశారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో హోరాహోరీగా జరిగాయి. అండర్–14, 17 బాలురకు కబడ్డీ, త్రోబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. హెచ్‌ఎం చలపతి, ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ గోపీకృష్ణ నాయక్, ఏపీరెడ్డి పాల్గొన్నారు.

గాడిచెర్ల సేవలు మరువలేనివి

నంద్యాల(వ్యవసాయం): గ్రంథాలయ ఉద్యమ నాయకుడు, స్వాతంత్య్ర సమరయోధుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు స్వాతంత్ర్యోద్యమంలో చేసిన సేవలు మరువలేనివని ప్రభుత్వ విశ్రాంత భౌతిక శాస్త్ర అధ్యాపకుడు రంగస్వామి పేర్కొన్నారు. గురువారం గాడిచెర్ల హరిసర్వోత్తమరావు యంతిని పురస్కరించుకొని స్థానిక శ్రీపింగళి సూరన స్మారక గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దుకాణాల్లో చోరీకి యత్నం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో గురువారం వేకువజామున గుర్తుతెలియని దుండగుడు ఐదు దుకాణాల్లో చోరీకి యత్నించాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎన్‌జీవోస్ కాలనీలోని ప్రధాన కూడలిలో నున్న ఐదు దుకాణాలకు చెందిన తాళాలు పగులగొట్టి చోరీ చేసేందుకు యత్నించాడు. అయితే ఒక కిరాణం దుకాణంలో రూ. 22 వేలు నగదు పోయినట్లు బాధితుడు తెలిపాడు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తామని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్‌ఎఫ్ నంద్యాల జిల్లా ప్రథమ నిర్మాణ సభను నిర్వహించారు. నంద్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధనుంజయుడును ఎన్నుకున్నారు.

ఘనంగా హిందీ భాష దినోత్సవం

రుద్రవరం: హిందీ భాష దినోత్సవంలో భాగంగా గురువారం తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో చిత్ర లేఖనం, పాటల పోటీలు, వ్యాస, వక్తృత్వ, పద్య పఠనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.